ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025 8 పేజీలు
గుంటూరు పల్నాడు

జిజిహెచ్‌కు తగ్గని రద్దీ

- పిహెచ్‌సీల్లో మెరుగుపడని చికిత్సలు
- కేంద్ర మంత్రి ఆదేశాలపై పట్టించుకోని జిల్లా అధికారులు
- వసతులు పెంచాలంటున్న పిహెచ్‌సిల వైద్యులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో రూరల్, అర్బన్ పిహెచ్‌సిలపై పర్యవేక్షణ తగ్గింది. పిహెచ్‌సిలలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో ఉండటం లేదు. కేవలం ప్రాథమిక చికిత్సలకే పిహెచ్‌సిల వైద్యులు, సిబ్బంది పరిమితం అవుతున్నారు. పిహెచ్‌సిలు అన్ని ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. సాయంత్రం 4 గంటల తరువాత వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. దీంతో ఎక్కువ మంది గుంటూరు జనరల్ ఆస్పత్రి, నరసరావుపేట, తెనాలి జిల్లా ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. దూర ప్రాంత వాసులకు ఈ మూడు ఆస్పత్రులకు చేరుకోవడం ఇబ్బందిగా మారుతోంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిపై వత్తిడిని తగ్గించేందుకు అర్బన్ పిహెచ్‌సిల పనితీరును మెరుగుపర్చాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించినా అధికారులలో చలనం లేదు. ఈ అంశంపై జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు ఎటువంటి సమీక్షలు కూడా లేవు.

అర్బన్ పిహెచ్‌సిలకు రోజుకు 50 నుంచి 100 మంది రోగులు వస్తున్నారు. రూరల్ పిహెచ్‌సిలకు 100 నుంచి 150 వరకు వస్తున్నారు. అర్బన్ పిహెచ్‌సిలకు కనీస సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నట్టు చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవి అందుబాటులో ఉండటం లేదు. ప్రధానంగా ఒకే డాక్టర్ విధులలో ఉండటం, ఎక్స్‌రే, స్కానింగ్ సదుపాయాలు లేకపోవడం వల్ల అర్బన్ పిహెచ్‌సిలకు వస్తున్న రోగులను అనివార్యంగా గుంటూరు జనరల్ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. దీంతో జనరల్ ఆస్పత్రిలో రద్దీ పెరుగుతోంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 4 వేల మంది వరకు రోగులు వస్తున్నారు. దాదాపు 150 విభాగాలకు సంబంధించిన చికిత్సలకు రోగులు సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారు. పిహెచ్‌సిలు, అర్బన్ పిహెచ్‌సిలో మౌలిక వసతులు, చాలినంత మంది సిబ్బంది,వైద్యులు లేకపోవడం వల్ల జిజిహెచ్‌కు పంపక తప్పడం లేదని అక్కడి వైద్యులు, సిబ్బంది చెబుతున్నారు. గుంటూరులో 16 అర్బన్ పిహెచ్‌సిలు ఉండగా గత

2లో

టిడిపిలో నామినేటెడ్ సందడి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- ప్రెస్ అకాడమి చైర్మన్‌గా అలపాటి సురేష్
- అమరావతి జెఎసి నుంచి ప్రాధాన్యం
- రేరా చైర్మన్‌గా శివారెడ్డి?, వడ్డెర కార్పొరేషన్‌కు మల్లేశ్వరరావు, ఎన్ఆర్‌టి సొసైటీకి డాక్టర్ వేమూరు రవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు చెందిన నలుగురికి అవకాశం దక్కింది. వీరిలో అమరావతి రైతుల తరుపున ఉద్యమం చేసిన నేతలకు నామినేటేడ్ పోస్టులు కేటాయించారు. ఎపి ఎన్ఆర్‌టి సొసైటీ చైర్మన్‌గా తెనాలికి చెందిన డాక్టర్ వేమూరు రవిని ఎంపిక చేశారు. ఆయన కొన్నేళ్లుగా టిడిపి ఐటి సెల్‌లో సేవలు అందిస్తున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మల్లెల ఈశ్వరరావును వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక చేశారు. గుంటూరులో బిసి జనాభా అధికంగా ఉండటంతో వైసిపిలో చంద్రగిరి ఏసురత్నం ఎమ్మెల్సీగా ఉండటంతో ఈ సామాజిక తరగతి వారిని ఆకర్షించేందుకు మల్లెల ఈశ్వరరావుకు అవకాశం ఇచ్చినట్టు చెబుతున్నారు. అమరావతి రైతుల తరుపున మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఉద్యమంలో కీలక భూమిక పోషించిన మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావు సోదరుని కుమార్తె రాయపాటి శైలజకు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేశారు. ఆరు నెలల క్రితం ఆమెకు పౌరసరఫరాల శాఖలో డైరెక్టరుగా నియమించినా అమె సంతృప్తి చెందకపోవడంతో ఈ సారి రాష్ట్ర స్థాయిలో క్యాబినెట్ హోదా కలిగిన పదవిని కేటాయించారు. సీనియర్ జర్నలిస్టు ఆలపాటి సురేష్‌కు ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్ పదవిని కేటాయించారు. రాజధానిని విధ్వంసం చేశారన్న ఆరోపణలపై గత ప్రభుత్వంపై విధ్వంసం పుస్తకాన్ని

2లో

రాయపాటి శైలజ, ఆలపాటి సురేష్

వాట్సప్ గవర్నెన్స్‌లో 15 నుండి స్మార్ట్ రేషన్ కార్డులు

ఈకెవైసిలో రాష్ట్రం టాప్ - కళాకారులకు అంత్యోదయ పథకం ద్వారా బియ్యం : మంత్రి నాదెండ్ల మనోహర్

వార్త మెయిన్‌లో

దుగ్గిరాలలో మొక్కజొన్న పొలంలో దహనమవుతున్న దంటు

పొలాల్లో అగ్నికీలలు...

ప్రజాశక్తి - దుగ్గిరాల

పొలాల్లో అగ్నికీలలు రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. రబీ సీజన్లో డెల్టా ప్రాంతంలో ఎక్కువగా మొక్కజొన్న సాగైంది. కండెలు విరుచుకున్న తర్వాత మిగిలే దంటను రైతులు తదుపరి సీజన్ కోసం పొలాన్ని సిద్ధం చేయడానికి పూనుకుంటున్నారు. ఇందులో భాగంగా మొక్కజొన్న దంటును పొలాల్లోనే కాల్చేస్తున్నారు. దీనివల్ల రైతులకే ఇబ్బందులు వస్తున్నాయి. ఇంకా 40 శాతం పంట పొలాల్లోనే ఉంది. దంటుకు అంటించే మంటలు పొరపాటున మిగతా పొలాల్లో పంటకు అంటుకుంటే ఆ నష్టం పూడ్చలేనిది. ఇటీవల దుగ్గిరాలకు చెందిన రైతు తాడిబోయిన నరసింహారావు పొలంలో పంటను కాపాడుకునే ప్రయత్నంలో అగ్ని ప్రమాదం

2లో

వట వృక్షాలపై గొడ్డలివేటు

- పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న ఆక్రమార్కులు
- చట్టాలకు తూట్లు పొడుస్తూ అక్రమ రవాణ

మాచర్లలో నరికిన అనంతరం ట్రాక్టర్లో తరలతులున్న చెట్లు

చెట్లను మనం కాపాడితే అవి మనలను కాపాడతాయి అందుకే 'వృక్షో రక్షతి రక్షిత్ణ' అన్నారు పెద్దలు. చెట్లు పశు, పక్షి, మానవ జాతులకు జీవనాధారం. చెట్లు లేకుండా మానవ మనుగడ సాధ్యం కాదు. మనం శ్వాస ద్వారా పీల్చే గాలిలోని ఆక్సిజన్ మొక్కలు, చెట్ల నుంచే లభిస్తుంది. తిండి, దుస్తులు, వేసుకునే మందులన్నీ చెట్ల పుణ్యమే. ప్రతి 10 మందుల్లో 9 మందులు మొక్కల నుంచే వస్తాయి. అయితే కొందరి అక్రమార్జనకు చెట్లు బలవుతుండగా అది వాతావరణానికి ప్రమాదంగా మారనుంది. ప్రజాశక్తి - మాచర్ల

2లో

మాచర్లలో కందిపప్ప మిల్లులు వద్ద ఉన్న కలప

నేటి నుండి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షల నిర్వహణ కోసం గుంటూరు జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్, ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు 23,279మంది హాజరు కానున్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 3,883 మంది హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇంటర్ ఆర్ఐఒ జుబేర్ తెలిపారు. వేసవి నేపథ్యంలో విద్యుత్ అంతరాయం లేకుండా, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

జిజిహెచ్‌కు తగ్గని రద్దీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వంలో 10 వరకు నూతనంగా నిర్మించారు. ఆరు పాత భవనాల్లో కొనసాగుతున్నాయి. మరో నాలుగు మంజూరుచేయాలని నగర ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో పూర్తిస్థాయిలో చికిత్సలు జరిగితే గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి, తెనాలి, నరసరావుపేట జిల్లా ఆస్పత్రులకు వత్తిడి తగ్గుతుందని పలువురు అధికారులు ఇటీవల కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు నివేదించారు. కానీ ఇంత వరకు ఈ కేంద్రాల్లో చికిత్సల మెరుగుదలకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన పర్యవేక్షణ చేయడం లేదు. ఈ అంశంపై గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్‌ఎస్‌వి రమణ ప్రజాశక్తితో మాట్లాడుతూ అర్బన్ పిహెచ్‌సిలకు ఇద్దరు వైద్యులను కేటాయించేందుకు తాను సిద్ధంగా ఉన్నాని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి రోజుకు 4 నుంచి ఐదువేల మందివస్తున్నారని సాధారణ ప్రాథమిక చికిత్సలకు కూడా ఇక్కడే వస్తున్నారని ఇందువల్ల సీరియస్‌గా ఉండే రోగులకు ఇబ్బంది వస్తుందన్నారు. అర్బన్ పిహెచ్‌సిలలో స్కానింగ్, ఎక్స్‌రే వంటి కనీస సదుపాయాలు కూడా లేకపోవడం వల్ల వీటి కోసం జిజిహెచ్‌కు వస్తున్నామని రోగులు చెబుతున్నారని ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు.

పొలాల్లో అగ్నికీలలు...

(మొదటి పేజీ తరువాయి)

బారిన పడి మరణించారు, దీనితో రైతులు అప్రమత్తమవుతున్నారు. పంటను సమీప గ్రామాలకు తరలించి ఖాళీ స్థలాల్లో నిల్వ చేస్తున్నారు. అయితే వీరికి పందుల బెడద, వాన భయం పట్టుకుంది. పంటపై పట్టాలు కప్పుతున్నా పందులు వాటిని చింపుతున్నాయి. పైగా పంట పొలాల నుండి తరలించుకునేందుకు అదనపు ఖర్చులు భారంగా మారాయి. రైతులందరూ తమ పంటను తీసుకున్నంత వరకు సంయమనం పాటిస్తే ఎవరికీ నష్టం ఉండదని కొందరు చెబుతున్నారు. మరోవైపు పొలాల్లో మంటల వల్ల భూసారం దెబ్బతింటుందని, వ్యవసాయ శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే మంటల వల్ల రానున్న సీజన్‌లో కలుపు బెడద దగ్గుతుందని రైతులు చెప్పుకొస్తున్నారు.



పంటపై పట్టాలు కప్పుతున్న రైతులు

వట వృక్షాలపై గొడ్డలివేటు

మాచర్లలో టింబర్ డిపోల వద్ద నున్న పెద్ద చెట్ల మోడులు..

- పర్యావరణానికి నష్టం కలిగిస్తున్న ఆక్రమార్కులు
- చట్టాలకు తూట్లు పొడుస్తూ అక్రమ రవాణ

ప్రజాశక్తి – మాచర్ల

మాచర్ల పరిసర ప్రాంతాల్లో అటవీప్రాంతం విస్తారంగా వుండటంతో దశాబ్దాల వయస్సు కలిగిన చెట్లు అధికంగా ఉన్నాయి. పొలాలు, ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ భూముల్లో ఈ వృక్ష సంపద గణనీయంగా ఉంది. చెట్లను నరికి సొమ్ము చేసుకొనే అక్రమార్కులకు వేసవి కాలం అనువుగా ఉంది. దీంతో రాత్రికి రాత్రే పొలాల్లోని చెట్లను నరికి, రంపాలతో ముక్కలు చేసి, వాటిని వాహనాల్లో తరలించి, అమ్ముకుంటున్నారు. గతంలో గొడ్డళ్లతో పెద్దపెద్ద చెట్లను నరకటం, వాటిని తరలించటం పెద్ద సమస్యగా ఉండేది. ఇప్పుడు చెట్లను నరికేందుకు వచ్చిన అధునాతన యంత్ర పరికరాలు పెద్దపెద్ద వట వృక్షాలను సైతం నేలకూల్చి గంటలో ముక్కలుగా చేసి ట్రాక్టర్లు ద్వారా మార్కెట్‌కు తరలిస్తున్నారు. సాయంకాలం చూసిన పెద్ద చెట్లు తెల్లవారే సరికి కనిపించడం లేదు.

నరికిన చెట్లు ఎక్కడికి పోతున్నాయి?

గతంలో చెట్లు, కొమ్మలు నరికి వ్యవసాయ పనిముట్లు, వంట చెరుకు కింద వాడేవారు, వ్యవసాయం యాంత్రికం కావటం, గ్యాస్ వాడకం పెరగడంతో రైతులు, సామాన్యులు కలపను వాడకం తగ్గించేసారు. నల్లతుమ్మ, వేప తదితర జాతుల కలపను గృహ నిర్మాణాలకు వినియోగిస్తారు. వాటిని టింబర్ డిపోలు కొనుగోలు చేస్తూంటాయి. జువ్వి, రావి, మర్రి, తుమ్మ వంటి చెట్లను ముక్కలుగా చేసి కందిపప్పు మిల్లులకు అమ్ముతుంటారు. మాచర్ల, దుర్గి పరిసర ప్రాంతాల్లో కందిపప్పు మిల్లులు అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం అక్రమార్కులకు కందిపప్పు మిల్లులు, కలప కోత మిషన్లు వరంగా మారాయి. వారికి పెద్దమొత్తంలో కలప అవసరం కావటంతో అక్రమార్కులు యథేచ్ఛగా చెట్లను నరికి సొమ్ము చేసుకుంటున్నారు. కందిపప్పు మిల్లుల్లో బాయిలర్లలో వాడేందుకు అధిక మొత్తంలో కలప అవసరం. దాంతో ఎక్కువ మంది మిల్లర్లు అక్రమార్కులు తీసుకొచ్చే కలపను కొనుగోలు చేస్తూంటారు. కలప తరలింపును ఎవరైన అధికారులు ప్రశ్నిస్తే, పొలంలో పడిపోయిన చెట్లను తరలిస్తున్నామని తప్పించుకుంటున్నారు. కందిపప్పు, టింబర్ డిపో యజమానులు కూడా తాము అక్రమంగా కలపను కొనటం లేదని చెబుతున్నారు. అవసరమైతే పెద్దలు రంగ ప్రవేశం చేసి అక్రమార్కులను కాపాడుతుంటారు.

అనుమతులు లేకుండా చెట్లను నరికేయవచ్చా?

అనుమతి లేకుండా, నిబంధలకు విరుద్ధంగా చెట్టును తొలగిస్తే అటవీ సంరక్షణ చట్టం ప్రకారం రూ.10 వేలు అపరాధ రుసుం, 3 నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష విధిస్తారు. చెట్లను నరకడం లేదా పాక్షికంగా నాశనం చేయడమూ నేరమే. అదే భారీ స్థాయిలో లేదా విలువైన చెట్లు, వృక్షాలు తొలగించాలంటే తహశీల్దార్ తర్వాత అటవీశాఖ అనుమతి కూడా తప్పనిసరి. చెట్లను పెంచటానికి అనేక పథకాలు అమలు చేస్తుండగా మరోవైపు భారీగా చెట్లు నరికివేతకు గురవుతున్నాయి. ఒక చెట్టు కూలిపోవటం వల్ల అనేక పక్షులకు అవాసం లేకుండా పోతుంది. చెట్టు మొదలు ప్రదేశంలో నివాసం ఉంటే అనేక క్రిమి కీటకాలు చనిపోయి పర్యావరణానికి నష్టం కలుగుతుందని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు. ఇళ్లలో పెంచుకుంటున్న చెట్లను తొలగించాలన్నా స్థానిక రెవెన్యూ అధికారి అనుమతి అవసరమే. మర్రి చెట్టు, వేప, అశోకచెట్టు వంటివి ఆక్సిజన్ ఎక్కువ ఇస్తాయి. వీటితో పాటు కలప కోసం ఉపయోగించే టేకు, మద్ది, ఏగేసి వంటి చెట్లను నరకాలంటే తహశీల్దార్‌తో పాటు ఫాం–2, ఫాం–4లను భర్తీ చేసి, అందులో ఆ చెట్లను నరకడానికి లేదా తొలగించడానికి కారణాలు తెలుపుతూ అటవీశాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ఎండిపోయిన చెట్లను తరలించటానికీ అనుమతులు తప్పనిసరని, ఒక చెట్టును తొలగిస్తే ఆ చెట్టు వయస్సును బట్టి ఎన్ని చెట్లను పెంచాల్సి వస్తుందో వాల్టా చట్టం చెబుతుందని అధికారులు చెబుతున్నారు. ఒక చెట్టు వయస్సును బట్టి అది విడుదల చేసే ప్రాణవాయువు ఎక్కువగా ఉంటుందని అంటున్నారు.

ఈ నేపథ్యంలో చెట్ల సంరక్షణ కోసం ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలి. కందిపప్పు మిల్లులు, టింబర్ డిపోలపై దాడులు జరిపి ఉన్న నిల్వలపై విచారణ చేయాలి. చెట్లను నరికే వారితోపాటు కొనుగోలు చేసిన వారి కూడా కేసులు నమోదు చేయాలి. చెట్ల వలన కలిగే ప్రయోజనాలు, చెట్లు లేకపోతే జరిగే నష్టాలు గురించి ప్రజలకు అన్ని విధాలుగానూ అవగాహన పెంచాలి.

చెట్లను నరికితే కేసులు చేస్తాం

ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ విజయలక్ష్మీ

అనుమతులు లేకుండా చెట్లను నరకడానికి వీలులేదు. అటువంటి చర్యలుకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తాం. ఈ నెలలో చెట్ల నరికి తరలించేవారిని పట్టుకొని రెండు కేసులు నమోదు చేసి, వారికి జరిమానా విధించాం. ఎవరైన చెట్లను అక్రమంగా నరుకుతున్నా, తరలిస్తున్నా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతాము.

ఇంటింటికీ కృష్ణా జలాలను అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి– తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో ఇంటింటికీ కష్ణా జలాలను అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పద్మ శాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. మంగళగిరి – తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి పెనుమాక టిడ్కో గహాలకు తాగునీటి సరఫరా నిమిత్తం ఆదివారం తాడేపల్లి చైతన్య తపోవన్ సమీపంలోని గుంటూరు ఛానల్ వద్ద తాగునీటి పైప్ లైన్ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అబద్ధయ్య మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంగళగిరి నియోజకవర్గ పరిధి పెనుమాక టిడ్కో గహాలను సందర్శించిన సందర్భంలో ఇంటింటికీ కృష్ణా జలాలను సరఫరా చేస్తామని హామీ ఇచ్చారని, ఈ నేపథ్యంలో పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని మంత్రి నారా లోకేష్ ధృడ సంకల్పంతో ఉన్నారన్నారు. టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ అమృత్ పథకం –2 క్రింద రూ.5 కోట్లతో 8.7 కిలో మీటర్ల పైపులైన్ పనులు చేపట్టి పెనుమాక టిడ్కో గృహాలకు కృష్ణానది నీటిని సరఫరా చేస్తామన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డ్ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపిలో నామినేటెడ్ సందడి

(మొదటి పేజీ తరువాయి)

ఆలపాటి రచించారు. ఈ పుస్తకాన్ని చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. ఆలపాటి సురేష్‌ను కూడా అమరావతి జెఎసి కోటాలో ఎంపిక చేశారని టిడిపి వర్గాలు తెలిపాయి. అమరావతి రైతుల తరుపున కూడా ఆయన పోరాటాలు చేసినట్టు చెబుతున్నారు.

అమరావతి జెఎసి చైర్మన్‌గా ఉన్న ఎ.శివారెడ్డికి త్వరలో రేరా చైర్మన్‌గా ఎంపిక చేయనున్నట్టు తెలిసింది. అయితే ఇంకా ఆయనకు ఈ పదవి ఖరారు కాలేదు. అయితే శివారెడ్డి కూడా అమరావతి రైతుల ఉద్యమంలో కీలక భూమిక పోషించినందున ఆయనకు కూడా అవకాశం ఇవ్వనున్నట్టు తెలిసింది. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రేరా) చైర్మన్‌గా ఆయన్ను నియమించనున్నట్టు తెలుస్తోంది. శివారెడ్డి ఎంపిక ఇంకా పరిశీలనలోనే ఉంది. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇప్పటికే పలువురుకి కార్పొరేషన్ పదవులు కేటాయించినా ఈసారి అమరావతి జెఎసి వారికి ప్రాధాన్యత ఇచ్చారని టిడిపి వర్గాలు తెలిపాయి. డిసిసిబి చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు, డిసిఎంఎస్ చైర్మన్‌గా వడ్రాణం హరిబాబును ఇటీవల ఎంపిక చేశారు. అయితే ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన జాబితాల్లోనే మల్లికార్జునరావుకు, హరిబాబుకు పదవులు ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఇంకా అనేక మంది ఆశావాహులు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవులు ఆశిస్తున్నారు. మహానాడు లోపల నామినేటెడ్ పోస్టుల భర్తీ చేయాలనే నిర్ణయంలో జిల్లాలో నలుగురుకి అవకాశం కల్పించారు. మిగతా వారికి ఎప్పటికి అవకాశం దక్కుతుందో వేచిచూడాల్సిందే.

మాతృ దినోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

మాత దినోత్సవాన్ని పురస్కరించుకొని బిగ్ టీవీ ఆధ్వర్యం లో.. అవసరమైన వారికి ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్ కు ఉపయోగార్ధం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని... తమ తల్లిదండ్రు లైన కీర్తిశేషులు గజవల్లి వెంకటలక్ష్మి సత్యవతమ్మ- వెంకట సుబ్బారావు జ్ఞాపకార్థం..వారి కుమారులు ప్రసాదరావు, మునే శ్వరరావు, నాగ పవన్ కుమార్ సహాయ సహకారాలతో.. విను కొండ జూనియర్ కాలేజీ గ్రౌండ్స్ నందు నిర్వహించడం జరి గింది. ఈ క్యాంపులో సీనియర్ సిటిజన్స్స, పేషెంట్స్ కు షుగర్, బిపి రక్తపరీక్షల వంటి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలతో పాటు తగిన మందులు ఉచిత పంపిణీ జరిగింది. డాక్టర్ పి వి చలపతిరావు. శ్రీనివాసరావు , యాపిల్ ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావువైద్య సేవలందిం చారు. ఈ కార్యక్రమ స్పాన్సర్స్ గజవల్లి నాగపవన్ కుమార్ సోదరులను పలువురు అభినం దించారు. కార్యక్రమంలో పవన్ కుమార్ బ్రదర్స్, రిపోర్టర్ సేగు నరసింహారావు, వాసవి క్లబ్స్, ఆర్యవైశ్య సంఘం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు గట్టుపల్లి శ్రీనివాసరావు, చందోలు మల్లికార్జున, నాగేశ్వరరావు అప్పల రాజా, బెల్లంకొండ ప్రసాద్, చిలంకూరు కోటేశ్వరరావు, పొత్తూరి రాము, రవీంద్ర, చందోలు సాయిబాబు, రెడ్డి నరేంద్ర, నల్లూరి శంకరరావు, విశ్వహిందూ పరిషత్ భాగవతుల రవికుమార్, భవనాసి సాంబశివరావు, గోనుగుంట్ల గంటారావు పాల్గొన్నారు.



గజవల్లి వెంకటలక్ష్మి సత్యవతమ్మ- వెంకట సుబ్బారావు కుటుంబ సభ్యులు

రైలింను ఢీకొట్టి నుజ్జునుజ్జు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణ శివారు అయ్యప్పస్వామి దేవస్థానం దగ్గర అద్దంకి నార్కెట్ పల్లి హైవే పక్కన ఉన్న సేఫ్టీ రేలింగ్ ను కారు ఢీ కొట్టిన ఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా కొండాపూర్ కు చెందిన బాణావత్ అరవింద్ మరియు సోనియాల వివాహం ఈ నెల 23 న జరుగనున్ననేపధ్యంలో ప్రీ వెడ్డింగ్ షుఉిఇ కోసం చీరాల సముద్ర తీరానికి వెళ్లి తిరిగి వస్తుండగా పిడుగురాళ్ల పట్టణ సమీపంలో వారు ప్రయాణి స్తున్న కార్ ఒక్కసారిగా అదుపుతప్పి హైవై పక్కనే ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టడంతో కారు పల్టీ పడింది. ఈ ప్రమాద సమయంలో కారులో నాలుగు వ్యక్తులు ఉండగా ఎవరికి ప్రాణ నష్టం జరగలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి క్షతగాత్రులను హైవే సిబ్బంది సహాయంతో స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలియజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ ఇన్‌చార్జ్ పోలీస్ కమిషనర్ సర్వ శ్రేష్ఠ త్రిపాటి ఆదేశాల మేరకు పోలీసు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ల పోలీసు అధికారులు వారి వారి సిబ్బందితో కలిసి ఆయా పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు, లా అండ్ ఆర్డర్, క్రైమ్ సస్పెక్ట్‌లకు, చెడునడత కలిగిన వ్యక్తులకు వివిధ సమయాల్లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎలాంటి నేరాలకు పాల్పడకుండా నేర ప్రవృత్తిని మాని మంచి నడవడికతో, సత్ప్రవర్తనతో మెలగాలని అన్నారు. ఎటువంటి అసాంఘిక కార్యక్రామాల్లో పాల్గొనకూడదని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా చేయకుండా సత్ ప్రవర్తన మార్గంలో నడవాలని, ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలను దూరం చేసుకుని మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరిపై పోలీస్ వారి నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎక్కడైనా గొడవలు, ఇతర నేరాల్లో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశంలో యుద్ధం.. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన

వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజ్జల సుధీర్ భార్గవరెడ్డి విమర్శ

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్ భార్గవరెడ్డి

దేశంలో యుద్ధం జరుగుతుంటే మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ పాలన సాగిస్తుందని వైసిపి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్చార్జి గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం కావస్తున్నా గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు సూపర్ సిక్స్ అమలు చేయకపోగా వైసిపి నాయ కులపై కక్ష సాధింపు చర్యలకు, అక్రమ కేసులకు పూనుకుం టున్నారని ఆయన విమర్శించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం లో ఒక కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న కారులో ఉన్న మాజీ మంత్రి విడుదల రజిని ని ఒక మహిళ అని కూడా చూడకుండా పక్కకు తోసివేసి కారులో ఉన్న వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డిని అరెస్టు చేయడం అక్రమమని ఆయన విమర్శించారు. ఏడు సంవత్సరాలు లోపు శిక్షలు పడే ఏ కేసులో నైనా ముందుగా నోటీస్ ఇవ్వాలని కానీ అట్లాంటి కనీస నిబంధనలు కూడా పాటించకుండా పోలీసులు శ్రీకాంత్ రెడ్డిని ఎలా అరెస్ట్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఇటీవల వైసిపి నాయకురాలు దళిత మహిళ కల్పనాపై అక్రమ కేసులు బనాయించి అర్ధరాత్రి ఇంటికి వెళ్లి ఆమెను అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు.ఇటువంటి అక్రమ అరెస్టులను వైసిపి తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. ఇటువంటి రెడ్ బుక్ పాలన, కక్ష సాధింపు చర్యలు, అక్రమ అరెస్టులు మానుకోవాలని, లేకుంటే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులు చలంచర్ల సాంబశివరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లు షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, మాజీ కౌన్సిలర్లు అచ్యుత శివప్రసాద్, బండి మల్లికార్జున రెడ్డి, లోక మాధవ రాజవరపు శివ నాగేశ్వరరావు, నాయకులు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, చిలకా జైపాల్, సహారా మౌలాలి, కొర్లకుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ గుండవరపు అనిల్ కుమార్ ఆర్థిక సహాయంతో

నిరుపేదలకు అందుతున్న సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-సత్తెనపల్లి


సరుకులు పంపిణీ చేస్తున్న సిఐ అవ్వారు వెంకట బ్రహ్మం

ఎన్ఆర్ఐ గుండవరపు అనిల్ కుమార్ ఆర్థిక సహాయంతో నిరుపేదలకు అందుతున్న సేవలు వెలకట్టలేనివి పలువురికి ఆదర్శనీయమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అవ్వారు వెంకట బ్రహ్మం అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని అబ్బూరు రోడ్డులో ఉన్న ఫణిదేపు సొసైటీలో 20 మంది నిరుపేదలకు అనారోగ్యంతో బాధపడుతున్న వృద్దులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. పల్నాడు జిల్లా,అమరావతి మండలంలోని ఉంగుటూరు గ్రామానికి చెందిన కీర్తిశేషులు గుండవరపు వెంకట్రావు జ్ఞాపకార్థం వీరి ధర్మపత్ని శివపార్వతి వీరి కుమారుడు గుండవరపు అనిల్ కుమార్ (అమెరికాలో స్థిరపడిన భారతీయులు)ధర్మపత్ని జయశ్రీ అనిల్ కుమార్ కుమారుడు, కుమార్తె అభిరామ్ శ్రీ ప్రణవి యొక్క ఆర్థిక సహాయంతో గంజి వీరాస్వామి పర్యవేక్షణ లో నిత్యవసరం సరుకులు పంపిణీ చేశారు. గంగూరు కళ్యాణ్ , కంచర్ల చిన నాగేశ్వరరావు మరియు గంగూరు సోమనాద్ సమన్వయంతో ప్రతి నెలలో ఒక రోజు 20 మందికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మే నెల సేవా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గంగూరు కళ్యాణ్ మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ఇంకా బాగా అవసరమైన నిరుపేదలను గంజి వీరాస్వామి గుర్తిస్తే మరో 5మందికి కానీ 10 మందికి కానీ అనిల్ కుమార్ యొక్క ఆర్థిక సహాయంతో ఒక్కొక్కరికి రూ.500ల సరుకులు 30 మంది వరకైన పంపిణీ చేస్తాం అని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షులుగా కట్టా దుర్గారావు, ముఖ్య అతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ అవ్వారు వెంకట బ్రహ్మం, విశ్రాంత ప్రధానోపాధ్యా యులు అవ్వారు ఠాగూర్, న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, గంగూరు కళ్యాణ్, గంగూరు సోమనాద్, ఫణిధరపు రామస్వామి, ఫణిధరపు జగదీష్, అనుముల పాపారావు, గాత్రం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - వినుకొండ

రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో ఇండో నేకప్ కెమికల్స్ వారి సహకారంతో మల్టీ సూపర్ స్పెషాలిటీ సేవలతో మెగా వైద్య శిబిరం కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ వారి నిర్వాహణలో జరగనుంది. ఈ నెల 13 వ తేదీ మంగళవారం స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపం ఆవరణలో ఉదయం 9 గంటలకు ప్రభుత్వ చీఫ్ విప్ జీవి. ఆంజనేయులు శిబిరం ప్రారంభిస్తారు. సాయం త్రం 4 గంటల వరకు శిబిరం కొనసాగుతోంది. శిబిరంలో గుండె, ఊపిరి తిత్తులు, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులు, ఎముకలు కీళ్లు, తదితర ప్రధాన వైద్య విభాగాలకు చెందిన వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొని ఉచిత వైద్య పరీక్షల తో పాటు మందులు కూడా ఉచితము గా అందజేస్తారు . కంటి పరీక్షలు కూడా నిర్వహించి అవసరమైన వారికి కళ్ల జోడు కూడా అందజేస్తామని చెప్పారు. ఉచిత కంటి ఆపరేషన్ కొరకు పేర్లు కూడా నమోదు చేసుకుంటారు. రోగులు తమ వెంట ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, ఆరోగ్య శ్రీ కార్డు కూడా తెచ్చు కోవలసినది. అన్ని పరీక్షలు అధునాతన కంప్యూటర్ అనుసంధాన పరికరాలు, వసతులు గల మొబైల్ వాహనము నందు నిర్వహించ బడును కావున వినుకొండ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియో గించుకొని ఆరోగ్యవంతమైన జీవితం పొంద వలసినది గా మెగా క్యాంప్ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కృష్ణా నదిలో మునిగి ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - కొల్లిపర

షేక్ బాజీ (ఫైల్ ఫోటో)

కష్ణానదిలో మునిగి ఆటో డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మండల కేంద్రం కొల్లిపరలో ఆదివారం జరిగింది. పోలీసులు వెల్లడిం చిన వివరాల ప్రకారం తెనాలి చెంచు పేటకు చెందిన షేక్ బాజి(25)కి రెండేళ్ల కిందట వివాహమైంది. ఆదివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యు లు, బంధువులతో కలసి ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు కొల్లిపర వెళ్ళాడు. అలాగే బంధువులు కుటుంబ సభ్యులతో కలిసి అక్కడ కష్ణా నది తీరానికి వెళ్లాడు. ఇసుక క్వారీ సమీపంలో తన అన్నతో కలసి ఈత కొట్టేం దుకు నదిలోకి దిగి, గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టపక్కల వాళ్లు పోలీసులకు సమాచారమచ్చారు. ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించి గజ ఈతగాళ్ల తో గాలింపు చర్యలు చేపట్టగా, రాత్రికి మతహం లభ్యమైంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నేడు ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ : ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణ తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యా శాఖ అధికారిని కలిసిన వారిలో జిల్లా సహాధ్యక్షురాలు పి.లీల, రాష్ట్ర కౌన్సిలర్ ఎ.అనంత్ కుమార్, ఎస్.చలపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

మురళీ నాయక్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

అమరులైన వీర జవాన్లకు నివాళులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మండల కేంద్రం రొంపిచర్ల చెరువుకట్ట సెంటర్లో ఆదివారం భారత్ -పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన వీరజవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీర మరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు సరికొండ వెంకటేశ్వరరాజు మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడిలో 26 మంది భారతీయులు మతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. దీనికి ప్రతీకారంగా జరిపిన "ఆపరేషన్ సింధూర్ " కార్యక్రమంలో మతి చెందిన ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆర్మీ నివాళులర్పించటం దారుణమని అన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భీకర పోరులో మన దేశానికి చెందిన వీరజవాన్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మురళీనాయక్, మరి కొందరు జవాన్లు మతి చెందడం బాధాకరమన్నారు. మతి చెందిన వీరజవాన్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గరికపాటి తాతయ్య, వెంకటకోటయ్య, వైసిపి నాయకులు పడాల వెంకిరెడ్డి, రామిరెడ్డి, సిపిఐ నాయకులు హుస్సేన్, బిసి సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షులు తిమ్మరాజు, మండల నాయకులు చక్రవరం సత్యం రాజు, ముక్కడాల వెంకటేశ్వరరావు, చక్రవరం బలరామరాజు, పసుమర్తి ఆదినారాయణ, గొడవర్తి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు గరికపాటి తాతయ్య, గాడిపర్తి వెంకటకోటయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కమిషనర్, వేణు, తహశీల్దార్ కిరణ్‌కుమార్

నేడు నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్‌లో వివిఎన్ గ్రౌండ్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరగనుందని కమిషనర్ వేణు, తహశీల్దార్ కిరణ్‌కుమార్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గంలో భూ వివాదాలు, భూ సమస్యలు, రేషన్ కార్డు, తదితర సమస్యలు నేరుగా కలెక్టర్, జిల్లా అధికారులకు దృష్టికి తీసుకు రావచ్చును. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా స్వీకరించి సమస్యల పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

నిరుపయోగంగా మీ-సేవా కేంద్రం భవనం

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన వైనం

వినియోగంలోకి తీసుకురావాలంటున్న స్థానికులు

లీజుకిచ్చినా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చే అవకాశం

మీ సేవా కేంద్రం మూతపడి, నిరూపయోగంగా వున్న బిల్డింగ్

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల సేవలు పౌరులకు సమర్ధవంతగా, పారదర్శకతగా, సుభంగా, వేగంగా అందించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు హయాంలో ఎలెక్ట్రానిక్ విధానంలో ఈ-సేవ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఈ సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వ సేవలుతో బాటు, ప్రైవేటు చెల్లింపులు సేవలు కూడా అందుబాటులోకి తెచ్చారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ సర్కార్ కొనసాగిం చింది. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉండగా, ఈ-సేవ కేంద్రాలను మీ-సేవ కేంద్రాలుగా మార్చింది. మీ-సేవ కేంద్రాలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండేవి.

మాచర్ల పట్టణంలో మాచర్ల పురపాలక సంఘం వారు గడియార స్తంబం వద్ద లక్షల రూపాయల వ్యయంతో నూతన బిల్డింగ్ నిర్మించి, ఈ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2004 ఆగస్టు 19న ప్రారంభించి సేవలు అందుబాటులో తెచ్చారు. మీ సేవా కేంద్రాల్లో 150కిపైగా సేవలు లభిస్తుండేవి. అప్పటి నుండి అర్జీదారులు ఏ పథకం కోసమైనా, సర్టిఫికేట్లకోసమైనా మీ-సేవా కేంద్రాన్ని ఆశ్రయించేవారు. ఈ మీసేవా కేంద్రం పట్టణానికి నడిబొడ్డున వుండటంతో ఎప్పుడు చూసినా రద్దీ కన్పించేంది. జగన్ ముఖ్యమంత్రిగా వచ్చిన తర్వాత మీ సేవా కేంద్రాలపై చిన్న చూపు చూశారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి వాటి ద్వారా పలు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చారు. దాంతో ఈ మీసేవా కేంద్రం మూతపడింది. అప్పటి నుండి మీసేవా కేంద్రానికి తాళం వేయటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. పోకిరీలు బిల్డింగ్ పైకి చేరి అల్లరి చేస్తున్నారు. రాత్రి వేళల్లో మందు బాబులు చేరి ఆగం చేస్తున్నారు.

లక్షల రూపాయల ప్రజా ధనంతో నిర్మించిన ఇంతటి పెద్ద భవనాన్ని ఐదేళ్ళ నుండి నిరూపయోగం ఉంచటం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని సచివాలయాలన్నీ ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం వాటికి వేల రూపాయలు అద్దెలు చెల్లిస్తుంది. మూత పడ్డ ఈ భవనంలో కనీసం మూడు సచివాలయాలు నడుపుకోవచ్చు. తద్వారా అద్దెల రూపంలో చెల్లిస్తున్న వేల రూపాయల ప్రజా ధనాన్ని ఆదాచేయవచ్చు. లేదా ఏదైనా ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించుకోవచ్చును. కనీసం లీజు ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చినా అప్పుల్లో వున్న పురపాలక సంఘానికి కొంత ఆదాయం సమకూరుతుంది. ఇలా నిరూపయోగంగా బిల్డింగ్‌ను ఉంచటం వలన భవనం శిథిలమవుతుంది. గతంలో కరెంట్ బిల్లులు ఈ బిల్డింగ్‌లో వున్న మీ సేవా కేంద్రంలో చెల్లించేవారమని, ఇప్పుడు దూరం గా ఉన్న విద్యుత్ కార్యాలయానికి వెళ్ళి చెల్లించాల్సి వస్తుందని స్థానికులు వాపోయారు. ఈ బిల్డింగ్‌ను ప్రజా అవసరాల నిమిత్తం వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

మీ సేవా కేంద్రం ఆవరణలోని గడియార స్తంభం(ఫైల్)

గడియార స్తంభాన్నీ కూల్చారు..

మాచర్ల పట్టణంలో ఒక ఐకానిక్ టవర్‌గా గడియార స్తంభం వుండేది. గడియార స్తంభం మీసేవా కేంద్రం ఆవరణలోనే వుండేది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత పాలకుల అనాలోచన నిర్ణయం తీసుకొని, గడియార స్తంభాన్ని పట్టణ ప్రధాన సెంటర్లో నిర్మిస్తామంటూ, 70 ఏళ్ళ కిందట నిర్మించిన గడియార స్తంభాన్ని కూల్చివేశారు. నూతనంగా నిర్మిస్తామని చెప్పిన పాలకులు ఆ తరువాత ఆ సంగతే మరిచారు. దాంతో పట్టణం ఒక ఐకానిక్ టవర్‌ను కోల్పోయింది.

20న సమ్మెను జయప్రదం చేయండి

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల మహేష్

ప్రజాశక్తి - మాచర్ల

కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తిప్పుకొట్టేందుకు దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన జరుగుతున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దామంటూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల మహేష్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆశావర్కర్ల యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు నాయక్ హాజరయ్యారు. సభకు అధ్యక్షత వహించిన మహేష్ మాట్లాడుతూ జాతీయస్థాయిలో పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సమ్మె ద్వారా కార్మికవర్గ శక్తిని కేంద్ర ప్రభు త్వానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. లేబర్ కోడ్ల రూపంలో కార్మిక హక్కులను హరించడం అన్యాయమని అన్నారు. కార్మిక కనీస వేతనాల పట్ల ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని కార్మికులు ఐక్యంగా కదిలితేనే ప్రభుత్వం దిగి వస్తుందన్నారు. సమ్మెకు అందరూ సిద్ధం కావడంతో పాటు తోటి కార్మికులను కూడా సమ్మెలో పాల్గొనేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు యూనియన్ నాయకురాలు చంద్రకళ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ఆశాలతో పాటు స్కీం వర్కర్లను కార్మికులు గా గుర్తించి కనీస వేతనాలు రూ. 26వేలు చెల్లించాలని, ఒప్పంద జీఓలు విడుదల చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్ల సాధనకై కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అధిక పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఆంజనేయులు నాయక్, ఏపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆదివారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రచురించిన సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ కేంద్రం లోని మోడీప్రభుత్వం కార్మికుల ప్రయోజనాల కోసమే చట్టాలను మార్పులు చేస్తున్నామంటూ 150 ఏళ్ళ క్రితం కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలలో కార్మికులకు ఉపయోగపడే అంశాలను తొలగించి లేబర్ కోడ్ లను తీసుకువచ్చి వారానికి 48 గంటలుగా ఉన్న పనివిధానాన్ని 72 నుండి 90 గంటలకు పెంచాలని ప్రభుత్వాలపై ఒత్తిడితెస్తున్నారని వేతనాల పెంపు, పని భద్రత తొలగిస్తారన్నారు.లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరం అవుతుందని పిఎఫ్, ఇఎస్ఐ, వాటా నిధులు ఎగ్గొట్టిన యజమానులు, కాంట్రాక్టర్లపై ఏ విధమైన శిక్షలు ఉండవని కుంటి సాకులతో యూనియన్ల గుర్తింపు, కార్మిక వర్గం జన్మహక్కు అయిన సమ్మె హక్కును తొలగిస్తారన్నారు. ఈ విధానం ద్వారా ఏవిధమైన భద్రత లేని ఉద్యోగాలు మాత్రమే ఇస్తారని కనీస వేతనాలు, పిఎఫ్,ఇఎస్ఐ, బోనస్, పెన్షన్ ఏమి అమలుకావన్నారు.

పల్నాడు జిల్లాలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయులు నాయక్, శివ కుమారి, తదితరులు

నిత్యం ప్రజారక్షణలో పోలీసులు : డిఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణకు పోలీసు శాఖ నిత్యం పని చేస్తుందని డిఎస్‌పి కె.నాగేశ్వరరావు అన్నారు. నరస రావుపేట పట్టణ సమీపంలో చిలకలూరిపేట రోడ్డులో గల ఎస్.ఆర్.కె.టికాలనీలో ఆదివారం తెల్లవారు జామున సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీలలో సరైన వాహన ధ్రువీకరణ పత్రాలు లేని ఒక కారు, ఒక ఆటో, 41 ద్విచక్ర వాహనాలతో పాటు గడ్డపార, కత్తులు, కొడవళ్ళను స్వాధీనం చేసుకున్నారు. డిఎస్‌పి మాట్లాడుతూ ఎస్‌పి కె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకై కొత్త వ్యక్తుల కదలికలు, అనుమానిత వ్యక్తులను విచారిస్తున్నామన్నారు. సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు భరోసా కల్పించడంలో భాగంగా చేపట్టిన తనిఖీలలో నరసరావుపేట సబ్ డివి జన్ పరిధిలోని నలుగురు సిఐలు, 14మంది ఎస్సైలు, ఏఎన్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన హరిశ్రీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మాజీ మంత్రి విడదల రజిని అనుచరుడైన మానుకొండు శ్రీకాంత్ రెడ్డిని నాటకీయా పరిణామాల మధ్య శనివారం నాదెండ్ల మండలం జం రూరల్ సీఐ సుబ్బనాయుడు ఆధ్వర్యంలో అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త అయిన రత్నా రెడ్డి వద్ద గత ప్రభుత్వ హయాంలో జిల్లా మొత్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాలకు కోడి గ్రుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టు ఇప్పిస్తానని రూ.28 లక్షలను తీసుకున్నట్లు కాంట్రాక్టులు ఇప్పించనందున ఆ డబ్బును తిరిగి ఇప్పించమని పోలీసులను ఆశ్రయించారని, దానికి పోలీసులు రత్నారెడ్డి చెప్పిన దాని ప్రకారం సాక్షుల సమక్షంలో ఎఫ్.ఐ.ఆర్ కట్టి అరెస్టు చేసిన శ్రీనాద్ రెడ్డిని ఆదివారం చిలకలూరి పేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఉదయం ప్రవేశ పెట్టారు. రత్నారెడ్డి తరపున ఉన్న ప్రధాన సాక్షి తన సమక్షంలో ఏటువంటి లావాదేవీలు ఏమి జరగ లేదని అఫి డవిట్ ఇచ్చినందున ఈ విషయమై షుమా రుగా రెండు గంటల పాటు వాదోపవాదనలు వి న్న అనం తరం జడ్జి రూ.50 వేల సొంత పూచికాట్‌పై శ్రీనాద్ రెడ్డికి బెయిల్ మంజూరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మంచి రోజులు!?

- ఎసిసి భూముల అమ్మకం ఛాలెంజ్ కేసు కోర్టులో విచారణ
- నష్టపరిహారం యాజమాన్యం చెల్లిస్తుందా.. భూమి కొనుగోలుదారులు చెల్లిస్తారా



ఆందోళన చేస్తున్న కార్మికులు, ఏసిసి సిమెంటు ఫ్యాక్టరీ (ఫైల్)

ప్రజాశక్తి- తాడేపల్లి

మొక్కవోని దీక్షతో.... ప్రభుత్వాలు.. పాలకులు సహకరించక పోయిన సుదీర్ఘకాలం పోరాటం చేసిన (చేస్తున్న) ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు మంచి రోజులు రానున్నాయా..! అంటే అవుననే సంకేతాలు వస్తున్నాయి. ఏసిసి భూములు నమ్మకం నమ్మకం మీద కార్మికులు హైకోర్టులో వేసిన చాలెంజ్ కేసు ఇటీవల విచారణకు వచ్చింది. కేసు పూర్వపరాలను పరిశీలించినట్లయితే కార్మికులకు నష్టపరిహారం రావడం షురూ. ఏసిసి యాజమాన్యం వస్తుందా లేక భూములు కొనుగోలు చేసిన బాలభాను ఎంటర్‌ప్రైజెస్, ఎన్‌ఆర్‌ఐలు ఇస్తారా అనేది తెలుసుకోవాల్సింది వాళ్ళిద్దరే. కార్మికులకు నష్టపరిహారం ఇవ్వడం అనేది మాత్రం గ్యారెంటీ అని ఈ కేసు చూస్తున్న ప్రముఖ లాయర్‌లు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఏసిసి మెంట్ ఫ్యాక్టరీ అక్రమ లాకౌట్ గురి అయిన తర్వాత 2003 కలకత్తా డిఆర్టి కోర్టు, కంపెనీ ఇండియన్ బ్యాంక్ బకాయి ఉందని తాడేపల్లి లో ప్రస్తుతం కార్మికులు దీక్షలు కొనసాగిస్తున్న ఫ్యాక్టరీ ఆస్తులను వేలం వేసింది. వేలంలో రూ 10 కోట్లు 92 లక్షల రూపాయలకు బాలభాను ఎంటర్‌ప్రైజెస్ పేరు మీద ఎన్నారైలు వేలంలో పాల్గొని ఈ భూములను దక్కించుకున్నారు. నేడు సుమారు 137 ఎకరాలు ఈ భూముల విలువ వందల కోట్లకు చేరుకుంది. వేలాన్ని నిలుపుదల చేయడానికి కార్మికులు కలకత్తా హైకోర్టులో వేసిన దావా ఫలితం ఇవ్వలేదు. అయితే ఈ కేసులో అదేకోర్టు తుది తీర్పు మాత్రం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు దేనాన్ని స్పష్టం చేయడం గమనార్హం. 2008లో డి ఆర్ టి కోర్టు వేసిన వేళాన్ని రద్దు చేయడానికి కార్మికులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రెటిపిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు నుంచి మూడు వాయిదాలు కూడా జరిగాయి. ఈలోగా తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. కేసు విచారణ ఆలస్యంగా అవటానికి, 10 సంవత్సరాల పైగా జాప్యానికి అదో కారణంగా ఉంది. ఉద్యమం అనంతరం ఈ కేసును తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు 2015లో బదిలీ చేశారు. హైకోర్టులో ఈ కేసు పలుమార్లు ట్రాక్‌లోకి తీసుకురావడానికి ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు లాయర్ ద్వారా ప్రయత్నించారు. 2025 ఏప్రిల్ నెలలో హైకోర్టులో ఈ కేసు డివిజన్ బెంచ్ ఫైనల్ హియరింగు కు వచ్చింది. సుమారు 50 నిమిషాల పాటు వాద ప్రతి వాదనలు జరిగాయి. వేసవి సెలవులు అనంతరం ఈ కేసు విచారిస్తామని కోర్టు ప్రకటించింది. ఎన్నారై తరఫున ఇరువురు లాయర్లు కూడా పాల్గన్నారు. కోర్టులో ఎన్‌ఆర్‌ఐ తరఫున అడ్వకేట్లు వాదించిన తీరును ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల తరఫున లాయర్లు సమర్ధవంతంగా తిప్పి కొట్టారు. ఎసిసి ఫ్యాక్టరీ భూముల అమ్మకాల మీద కార్మికుల వేసిన చాలెంజ్ కేసు ఓ కొలిక్కి వచ్చినట్టు కార్మికులు భావిస్తున్నారు. కార్మికులు తరఫున వాదించిన లాయర్లు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారం రావడం అనేది నువ్వు నూటికి నూరు శాతం తమకు అమ్మకం ఉందని, కార్మికులకు నష్టపరిహారం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లిస్తుందా, లేక భూములు కొనుగోలు చేసిన బాలభాను ఎంటర్ప్రైజెస్ తరఫున ఎన్‌ఆర్‌ఐ కి చెల్లిస్తారా అనేది రానున్న తీర్పు సారాంశం అని కార్మికులు భావిస్తున్నారు. 30 ఏళ్ల సుదీర్ఘకాలం సాగిన సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటం అనేక ఒడిదుడుకులు, పాలకుల సవాళ్లను ఎదుర్కొని నేటికీ సజీవంగా నిలిచింది. కార్మికులకు మంచి రోజులు రావాలని అందరం భావిద్దాం.

159వ రోజుకు చేరిన దీక్షలు

ఏసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు ఆదివారం నాటికి 159 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సిహెచ్. పిచ్చయ్య, ఎన్ సుబ్బారావు, వై.సాంబయ్య, బి.నవనీతం, కె.అగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు బి.సూర్యప్రకాష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ దిశగా చర్యలు తీసుకొని కార్మికు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, డి.నాగేశ్వరరావు, ఎం.సాంబశివరావు, ఎస్.కె.ఇమాంబి, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గా భవాని తదితరులు పాల్గొన్నారు.

చర్చాగోష్టిలో మాట్లాడుతున్న వక్తలు

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులపై 'అరవింద'లో సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త జిడ్డు కఅష్ణమూర్తి జయంతి సందర్భంగా ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్ నందు ఆదివారం విద్యారంగం ద్వారా జరగవలసిన విప్లవాత్మకమైన మార్పులు పై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు వక్తలు పాల్గని మాట్లాడుతూ అసలైన విప్లవం జరగవలసింది హఅదయపు లోతుల్లోనని, మనుషులు సమూలమైన పరివర్తన కలగకపోతే ఈ రోజుల్లో చూస్తున్న, వింటున్న యుద్ధం, హింసకాండ, విధ్వంసక చర్యలు జరుగుతాయని అభిప్రాయపడ్డారు. జిడ్డు కఅష్ణమూర్తి ప్రసంగాల సారాంశాన్ని సమావేశంలో పాల్గన్న వ్యక్తులు మనుషులు రావలసిన మార్పులు గురించి, ప్రపంచమంతా పర్యటిస్తూ జిడ్డు కఅష్ణమూర్తి చేసిన ప్రసంగాలపై చర్చించుకున్నారు. అరవింద హైస్కూల్ ప్రిన్సిపల్ ఇంద్రాణి మాట్లాడుతూ విద్యార్థి దశలు విద్యార్థికి తన గురించి అవగాహన, ఇతరుల పట్ల ప్రేమ, సమానత్వం, పర్యావరణ అవగాహన ఉండాలన్నారు. అరవింద పాఠశాలలో జిడ్డు కఅష్ణమూర్తి అధ్యయన కేంద్రాలు ఉండడం, తల్లిదండ్రులకు విద్యార్థులకు ఉపాధ్యాయులకు విద్యపై సరైన అవగాహన కల్పించడం అనేక సంవత్సరాలుగా జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ చర్చ కార్యక్రమంలో అరవింద హైస్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఆన్లైన్ ద్వారా హాజరయ్యారు.

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

మాట్లాడుతున్న డాక్టర్ ఫణిశ్రీ

ప్రజాశక్తి - గుంటూరు

కిడ్నీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఫణిశ్రీ అన్నారు. ఆదివారం అవాగాహన కార్యాంలో కిడ్నీ సమస్యలపై ఆరోగ్య సభ జరిగింది. యూరాలజిస్ట్ డాక్టర్ మన్నే నిశాంత్ పాల్గొన్నారు. డాక్టర్ ఫణిశ్రీ మాట్లాడుతూ మన శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపించే అతి ముఖ్యమైన ప్రక్రియను చేసే కిడ్నీల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రోస్టేట్ గ్రంధి వాపు ఉన్న వారికి, వంశపారంపర్యంగా కూడా మూత్రపిండ సమస్యలు రావచ్చన్నారు. సాధారణంగా కిడ్నీ సమస్యలకు గురి అయిన వారిలో కాళ్లు, మొఖం వాపు రావడం, నీరసం అనిపించడం ఆకలి, అరుగుదల తగ్గడం, మూత్రం తక్కువగా రావడం లాంటి లక్షణాలు ఉంటాయన్నారు. రక్త పరీక్షలు, స్కానింగ్ చేయించుకోవాలన్నారు. డయాలసిస్ అవసరమైన వారిలో ఫిస్టులా విధానంలో చిన్న ప్రొసీజర్ చేయాల్సి వస్తుందని తెలిపారు. తక్కువగా నీటిని తీసుకోకపోవడం వల్ల కూడా శరీరం డీహైడ్రేషన్‌కు గురై మూత్రపిండ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. కావున మనం చేసే పనిని బట్టి మరియు మన శరీర తత్వాన్ని బట్టి తగిన మోతాదులో నీటిని త్రాగాలని రోజుకు కనీసం రెండు నుండి నాలుగు లీటర్ల నీటిని త్రాగాలన్నారు. ఈ సందర్భంగా వైద్యులను అవగాహన సభ్యులు తస్కరించారు. సభకు టీ.వీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ప్రొఫెసర్ టి.రత్నారావు మాట్లాడారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలందిస్తున్న ఆంధ్రాప్రైమ్ హాస్పిటల్

మందులు పంపిణీ చేస్తున్న డేగల ప్రభాకర్

ప్రజాశక్తి - గుంటూరు

పేద ప్రజలకు ఆంధ్రప్రైమ్ హాస్పిటల్స్ మెరుగైన వైద్యసేవలు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆంధ్రాప్రైమ్ హాస్పిటల్స్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. మథెర్స్ డే సందర్భంగా ఆదివారం నల్లపాడు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో కల్వరి రక్షణ మందిరం ఆద్వర్యంలో ఆంధ్రప్రైమ్ హాస్పిటల్స్, గ్రేస్ క్యాన్సర్ హాస్పిటల్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని డేగల ప్రభాకర్ ప్రారంభించి, పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతికుటుంబంలో తల్లి ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బాగుంటుందని అన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. మహిళలలో వస్తున్న క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, క్యాన్సర్ నిర్మూలించడానికి గ్రేస్ హాస్పిటల్స్ అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్ అచ్చంశెట్టి, డాక్టర్ సాయి రాజశేఖర్ కాసుల, డాక్టర్ మాధవీలత, డాక్టర్ గౌరి, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ క్రిస్టీనా, కల్వరి మందిరం డాక్టర్ డేనియల్ ఫిన్నీ, డాక్టర్ సహనశ్రీ, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ డాక్టర్ చిన్నబాబు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న క్లబ్ బృందం

మధుమేహం గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపుతుంది

ప్రజాశక్తి - తెనాలి

మధుమేహం ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే గుండె రక్తనాళాలపై ప్రభావం చూపుతుందని డాక్టర్ పి.వెంకటేష్ చెప్పారు. వాకర్స్ క్లబ్ ఆదివారం రాత్రి స్థానిక కవి రాజాపార్కో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వెంకటేష్ పాల్గొని, మధుమేహంతో వచ్చే సమస్యలపై వివరించారు. వ్యాధిగ్రస్తులు తోసుకోవాల్సిన జాగ్రత్తలు వెల్లడించారు. అనంతరం ఆయనను క్లబ్ తరఫున సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు ఆనందయ్య, కార్యదర్శి కే రవిబాబు, డాక్టర్ ఉదయ్ కుమార్, రత్తయ్య, అశోక్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

హనుమాయమ్మను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మదర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

మాతృ దినోత్సవ వేడుకలు స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో లాఫింగ్ క్లబ్ అధక్షడు లాల్ వజీర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చందు హనుమాయమ్మకు సన్మానం చేశారు. ఎన్‌టిఆర్ స్టేడియంకు వచ్చిన పిల్లలకు అమ్మతో ఎలా ఉండాలి, ఎలా గౌరవించాలి, వ్యక్తి జీవితంలో అమ్మ పాత్ర గుర్తించి వక్తలు తెలియజేశారు.. కార్యక్రమంలో పెద్ది శివరాంప్రసాద్, ధర్మకిషోర్, కల్పన, ప్రసన్న, లక్ష్మి, వీర రత్నమ్, శ్రీనివాస్, లంక మాధవి, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆనంద్

ఫుట్‌పాత్‌లపై వ్యాపారం తొలగించాలి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ట్రాఫిక్‌కు అంతరాయంగా మారిన ఫుట్‌పాత్ వ్యాపారాలను వెంటనే తొలిగించాలని తెనాలి తాలూకా ఎస్ఐ కె.ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నందివెలుగు ప్రధాన కూడలిలో ఫుట్పాత్ వ్యాపారాలు తరచూ ప్రయాణికులకు అంతరాయం కలిగిస్తున్నాయని, నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఫుట్ పాత్‌లు ఆక్రమించుకుని వ్యాపారం నిర్వహించడం నేరమని వ్యాపారులకు ఆదివారం సూచించారు. ప్రమాదాలకు నెలవైన వ్యాపార సముదాయాలను వెంటనే తొలిగించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లగించినవారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పొలేష్‌ను సన్మానిస్తున్న రిటైర్డు అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ

పొలేష్‌కు సేవా భూషణ్ అవార్డు

ప్రజాశక్తి - వినుకొండ

తెలుగు కళా రత్నాలు సాంసతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడ లోని కౌతా పరిపూర్ణానంద కళా వేదిక నందు దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పల్నాడు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు పెద్దిటి పొలేష్‌కు సేవా భూషణ్ అవార్డును రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మురళీకష్ణ చేతుల మీదగా ప్రధానం చేయడం జరిగింది. పల్నాడు జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా దళిత గిరిజన వర్గాలకు పొలేష్ చేసిన సేవలను గుర్తించి ఆ వర్గాలను చైతన్య పరచడం లో కీలక పాత్ర పోషించినందుకు గాను పొలేష్ కు అవార్డును అందించడం జరిగిందని జాతీయ తెలుగు కళా రత్నాలు సేవా సంస్థ సీఈవో డాక్టర్ యువిరత్నం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి పలనాడు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు గార్లపాటి దాసు, బంక శ్రీనివాసరావు, యాసారపు బాబు, సత్తనపల్లి డివిజనల్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వేల్పుల అఖిల్, గురజాల డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాయి నూతల సురేష్, దళిత నాయకురాలు నన్నెపాగ ప్రశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొలేష్‌ను పలువురు ప్రముఖులు అభినందించారు.

బదిలీలు, ప్రమోషన్లు పారదర్శకంగా నిర్వహించాలి : ఎస్టియు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు బదిలీలు జరగబోయే నేపథ్యంలో బదిలీలు పదోన్నతులు పారదర్యకంగా నిర్వహించాలని కోరుతున్నట్లు ఎస్టియు రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే. కోటేశ్వర రావు ఎస్టియు డైరీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండే విధంగా బదిలీలలో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఐదు తరగతులకు ఐదుగురు టీచర్లు ఉండే విధంగా 120 రోలు దాటిన ప్రతి పాఠశాలకు ఒక పిఎస్ హెచ్‌ఎం 5 గురు టీచర్లు ఉండే విధంగా బదిలీలు నిర్వహించాలని తెలిపారు. మున్సిపల్ స్కూల్స్ పర్యవేక్షణకు అర్బన్ ఎంఈఓ నియమించాలని, స్పోస్ ప్రాధాన్యత ఉన్న టీచర్లకు అంతర యాజమాన్య బదిలీలకు అనుమతించాలని పేర్కొన్నారు.

పిఎస్‌హెచ్‌ఎం పోస్టులను ఎస్‌జీటీలకే ఇవ్వాలి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పిఎస్‌హెచ్‌యం పోస్టులను ఎస్‌జీటీలకే ఇవ్వాలని ఎస్.టి.యు.పి.రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.యం. సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సంవత్సరాలుగా ఎస్.జీ.టీ.గా సర్వీసు చేస్తున్న వారు ఒక్క ప్రమోషన్ కూడ పొందని వారు రాష్ట్రవ్యాప్తంగా చాలామంది ఉపాధ్యాయులు ఉన్నారని.కొత్తగాఏర్పాటు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ఎస్‌జీటీలనే ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని, స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్ట్ టీచర్లను పిఎస్‌హెచ్‌యంగా నియమించడం వలన వారికి వారి సబ్జెక్ట్ మీదే పట్టు ఉంటుందని తెలిపారు. 1నుండి5 తరగతులలో అన్నిసబ్జెక్ట్ లు చెప్పాలంటే ఎస్‌జీటీలకే అనుభవం ఉందన్నారు. ఎస్‌జీటీలకు మ్యాన్యువల్ కౌన్సిలింగ్ పెట్టాలని,ప్రభుత్వం ఎస్‌జీటీలకు తగిన న్యాయం చేయని పక్షంలో పెద్దఎత్తున రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చూస్తారని సుభాని ఆ ప్రకటనలో హెచ్చరించారు.

మట్టిలో మాధుర్యం.. సృజనాత్మకతకు దోహదం..

విద్యార్థులకు వేదికగా బాసట వేసవి శిక్షణ శిబిరం

చిన్నారులు మట్టితో చేసిన కళాకృతులు

ప్రజాశక్తి - యడ్లపాడు

స్వీయ నైపుణ్యాలను పెంపొందించేందుకు బాసట సామాజిక సాంస్కృతిక వేదిక చేపట్టిన వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపు తున్నాయి. ఏప్రిల్ 28 నుండి మే 27వ తేదీ వరకు కొనసాగనున్న ఈ తరగతులలో భాగంగా ఆదివారం ప్రత్యేకంగా మట్టితో ఆకతుల తయారీపై శిక్షణ అందించడం విశేషం. యడ్లపాడు గ్రామంలోని స్థానిక నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నిర్వహిస్తున్న ఈ వేసవి శిక్షణ ఆదివారం కొనసాగాయి. మాతదినోత్సవం సందర్భంగా విద్యార్థులు రూపొందించిన మాతశిశు మట్టిబొమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శిక్షణకు విజయవాడకు చెందిన నైపుణ్యవంతుడు లక్ష్మణరావు మార్గదర్శకత్వం వహించారు. ఆయన సూచనలతో విద్యార్థులు చక్కటి కళా నైపుణ్యాన్ని ప్రదర్శి స్తూ రకరకాల బొమ్మలు, అలంకార వస్తువులు, గృహోప కరణాల్ని మట్టితో తయారు చేసి అందర్నీ ఆశ్చర్య పరిచారు. చిన్నచిన్న చేతులలోంచి వెలసిన ఆ కళాకృతులు మట్టిలోని మాయాజాలాన్ని పరిపూర్ణంగా ప్రతిబింబించాయి. ఈ సందర్భంగా కాళిదాసు మాట్లాడుతూ సృజనాత్మకత నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తులో దారిచూపే దీపస్తంభాలు అవుతాయన్నారు. ఈనెల 27న జరిగే ముగింపు కార్యక్రమంలో బాసట ఆధ్వర్యంలో ఉపకార వేతనాల అందించేందుకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో ఎంపికైన విద్యార్థులకు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాసట విద్య కమిటీ కన్వీనర్ కల్లూరి వాసు, కేత రామబ్రహ్మం బాసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసుతో పాటు పీటర్, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్, రామకృష్ణ, విన్ను, వినయ్‌కుమార్, బేగం, నాగరాజు, డాక్టర్ రఘున్ను మాస్టర్, ధనలక్ష్మి పాల్గొని విద్యార్థులను అభినందించారు.

శాంతిబాయికి 'ఐడియల్ మదర్' అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ స్థాయి సాంస్కృతిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ద్వారా ఏలూరు మహాలక్ష్మి కన్వెన్షన్ హాల్లో జరిగిన మాతదేవోభవ కార్యక్రమంలో సంస్థ సీఈఓ కత్తి మండ ప్రతాప్ డాక్టర్ సాంబేలు శాంతి బాయి ముగ్గురు ఆడపిల్లల్ని చక్కగా చదివిస్తూ స్టేట్ మరియు జిల్లా ర్యాంకులు సాధించడానికి ఎంతో ప్రోత్సాహం అందిస్తూ చదువుతోపాటు కళలు, సాంస్కృతిక ,సేవ ,అన్ని రంగాలలో పిల్లల్ని ప్రోత్సహిస్తు మంచి తల్లిగా, ఉత్తమ ఉపాధ్యాయురాలి, సమాజ సేవకురాలి గా, రచయితగా,యూనియన్ లీడర్‌గా 14 సంస్థలో ముఖ్యపాత్రను పోషిస్తూ నేటి యువతరానికి ఎంతో ఆదర్శంగా నిలుస్తున్న మాతమూర్తి అని ఆమెను అభినందించారు.

అవార్డు అందుకుంటున్న శాంతిబాయి

సంస్థ సభ్యులు కత్తి మండ ప్రతాప్‌తో పాటు రమాదేవి ,ఈశ్వరి భూషణం , లలితా శ్రీ ,పార్థసారథి, కష్ణకుమారి, శిరీషఆమెకి అవార్డు అందజేసి అభినందించారు.

మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కృత్రిమంగా తయారు చేసేందుకు సాధ్యం కాని రక్తం దానం చేసేందుకు యువతతో పాటు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పిలుపునిచ్చారు. జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డి.సునీత ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణం కోట సెంటర్‌లోని మెడికల్ అసోసియేషన్ భవనంలో నరసరావుపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 40 మందికి పైగా రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ రక్తదానం పట్ల అపోహలు వీడి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లాలో రక్త కొరత తీరాలంటే దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. అనంతరం రక్తదాతలకు ఎమ్మెల్యే ప్రసంశా పత్రాలు అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం వల్ల ఎంతో మంది ప్రాణాల కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట కెమిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దేసు శ్రీనివాసరావు, సెక్రెటరీ పివిఎస్ మోహనరావు, ట్రెజరర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

600 మందికి వైద్య పరీక్షలు

కంటి ఆపరేషన్‌కు 310 మంది ఎంపిక

ప్రజాశక్తి - పెదకూరపాడు

యూనియన్ బ్యాంక్ విశ్రాంత జనరల్ మేనేజర్ డాక్టర్ కెఎల్‌రాజు చేస్తున్న సేవలు యువతరానికి ఆదర్శమని పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరావు తెలిపారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా కీర్తిశేషులు కొమరాబత్తిన రోజమ్మ (టీచర్), కార్యంశెట్టి జయరావు జ్ఞాపకార్థం ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో పెదకూరపాడులోని ఆర్సిఎం ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరం జరిగింది. మండల టిడిపి అధ్యక్షులు అర్తి మల్ల రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కంటి వైద్య శిబిరాలు విశ్రాంత జనరల్ మేనేజర్ కేఎల్ రాజు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ వైద్య శిబిరాలు పెద్దకూరపాడు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. 600 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 310మందికి కంటి ఆపరేషన్ చేయాలని డాక్టర్లు నిర్ధారించారు. అవసర మైన వారికి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వనున్నారు.

కంటి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న వైద్యులు

సాధారణ వ్యాధులు, దంత పరీక్షలు కూడా నిర్వహించారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ రత్తయ్య, శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్లు, ఆసుపత్రి సూపర్వైజర్ శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బెల్లంకొండ రాంగోపాలరావు, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, డీఎస్పీ అజయ్ కుమార్, శాఖమూరి సీతారామయ్య,పొట్టి నాగమల్లేశ్వరరావు, గుడిపూడి చిన్నరాజు పాల్గొన్నారు.



మంగరాజుకు నివాళి అర్పిస్తున్న పార్టీ నాయకులు

టిడిపి నాయకుని మృతికి పలువురు నివాళి

ప్రజాశక్తి - బెల్లంకొండ

బత్తుల మంగరాజు మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని నరసరావుపేట పార్లమెంటు కమిటీ కార్యదర్శి తమ్మిశెట్టి సత్యనారాయణ ఆదివారం అన్నారు. బెల్లంకొండ మండలం నాగిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన బత్తుల మంగరాజు (52) శనివారం రోజు గుండిపోటుతో మృతి చెందటం బాధాకరమన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మంగరాజు పార్టీ కోసం చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ పిలుపునిచ్చే ఏ కార్యక్రమంలోనైనా ధైర్యంగా తెలుగుదేశం జెండాని పట్టుకొని నడిచిన వ్యక్తి ఆయనని కొనియాడారు. అనంతరం ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 5వేలను నరసరావుపేట పార్లమెంటు. కమిటీ సభ్యులు తమ్మిశెట్టి సత్యనారాయణ ఆర్థిక సహాయ కుటుంబానికి అందజేశారు. అనంతరం పార్థవదేహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వేముల శ్రీరామకష్ణ. తిరుపతి చెంచయ్య. బత్తుల నాగరాజు, తిరుపతి లక్ష్మీనారాయణ, వేముల గురవయ్య, కుంచాల సురేషు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఫల్యాలను సరిచేస్తూనే రాష్ట్రాభివృద్ధికి కృషి

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కొమ్మాలపాటి శ్రీధర్

గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని ఆ వైఫల్యాలు సరి చేస్తూనే రాష్ట్రాభివద్ధి కోసం కూటమి ప్రభుత్వం పాటు పడు తుందని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాల పాటి శ్రీధర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం టిడిపి కార్యాలయం లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో కొమ్మాలపాటి మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చి ఉంటే ప్రజలు ఆస్తులు, భూములు కోల్పోయేవారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ శ్రమను దష్టిలో పెట్టుకొని, అధికార యంత్రాంగం ఉన్నంతలో ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూనే ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన విధానాలపై వివిధ శాఖల అధికారులు ప్రజలకు విస్తత అవగాహన కల్పిస్తున్నారన్నారు. కొత్త రేషన్ కార్డులు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అమ లు చేయబోతుందని పోలవరం, అమరావతి పూర్తి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

సారాయి రహిత గ్రామాలే లక్ష్యం

ప్రజాశక్తి-ఈపూరు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వర్లు

సారాయి రహిత గ్రామాలే లక్ష్యంగా బొల్లాపల్లి మండలంలో అటవీ పరిసర గ్రామాలలో నవోదయం-2 కార్యక్రమం చేపట్టినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి అడాప్షన్ అధికారులతో నిరంతరం పర్యవేక్షణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టడం ద్వారా సారా తయారిని నియంత్రిం చడంతో పాటు పాత కేసులలో ఉన్న వారిని ముందస్తుగా తహసిల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందని సిఐ తెలిపారు. నాటు సారాయి తయారీ, రవాణా, అమ్మకం లేవని నిర్ధారించుకొని బ్రిడ్జితండా, బోడి పాలెం, ఇనిమెడ, గండిగనుమల తండాలను నాటు సారాయి రహిత గ్రామాలుగా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సిఐ తెలిపారు. సారాయిపై సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రజాశక్తి
7
గుంటూరు జిల్లా
సోమవారం 12 మే 2025

పడావుగా స్థలం.. వినియోగంలోకి తెస్తే ఉపయోగం

ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి

తాడేపల్లి భరతమాత విగ్రహం దగ్గర నుండి కుంచనపల్లి ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం వరకు సుమారు రెండు కిలోమీటర్లు దూరం గల బకింగ్ హోమ్ కాలువ వెంబడి బ్రహ్మాండమైన స్థలం ఉంది. ఈ స్థలంలో ప్రస్తుతం పట్టణంలో వివిధ ప్రాంతాల నుండి సేకరించుకొచ్చిన చెత్తతో పాటు కొంతమంది తమ ఇళ్లల్లోని వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారు. సాయంత్రం పూట, ఉదయం సీనియర్ సిటి జెన్లు వాకింగ్ ట్రాక్‌గా ఈ రోడ్డును వినియోగిస్తున్నారు. భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. కట్ట పొడవునా సుమారు 10 ఎకరాల స్థలం ఇక్కడ పడావుగా పడి ఉంది. ఈ భూమిని వినియోగంలో కొట్టేస్తే రైతు మార్కెట్ ఇక్కడ పెట్టే అవకాశం ఉంటుంది. అలాగే పెద్ద ఎత్తున అపార్ట్మెంట్లు సంస్కృతి విస్తరిస్తున్న తాడేపల్లి బైపాస్ రోడ్డుకు ఈ ప్రాంతంలో రైతు మార్కెట్ పెడితే దగ్గరగా ఉండటంతో పాటు అందుబాటులో ఉంటుందనే అభిప్రాయం ఇటీవల పట్టణ పౌరుల సంక్షేమ సంఘం నాయకులు ఈ

చెత్తా చెదారంతో నిరుపయోగంగా ఉన్న స్థలం

ప్రాంతంలో పర్యటించిన సందర్భంగా అభిప్రాయపడ్డారు. వేలాదిమంది ఎక్కడెక్కడ నుండో వచ్చి ఇక్కడ అపార్ట్మెంట్లో ప్లాట్లు కొనుగోలు చేసి స్థిరపడుతున్నారు. వీరందరూ ఇప్పుడు కూరగాయలు కొనుగోలు చేయాలంటే సరైన రైతు బజార్ లేక విజయవాడ నగరానికి వెళ్లాలి చేస్తుందని చెబుతున్నారు. పైన పేర్కొన్న ప్రదేశంలో వ్యర్థాలను తొలగించి కాలవ వైపు పెన్షన్ వేసి రైతు బజార్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యాలు కల్పించిన వారు అవుతారని, ఎం టిఎంసి అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పెద్ద ఎత్తున ఖాళీ స్థలం ఉండటంతో రైతు బజార్ తో పాటు మాంసం విక్రయాలు కూడా జరపటానికి వీలుగా ఇక్కడ కబేలా ఏర్పాటు చేయాలని కూడా స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం కబేలా లేకపోవడంతో ఆంధ్ర రత్న పంపింగ్ స్కీం కాలువలో వ్యర్థాలు అన్నిటిని పడేస్తున్నారని స్థానికులు చెప్తున్నారు. దీనివల్ల కాలువలో నీరు కలిసి ఉండటంతో పాటు చుట్టుపక్కల ప్రజలకు అనారోగ్యాలు పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ఇటు రైతు బజారు, ఆటు మాంసం విక్రయాలకు కబేలా ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీర్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. స్థానికులు డిమాండ్ ను పట్టణ పౌర సంక్షేమ సంఘం బలపరుస్తుందని కన్వీనర్ జై.శేషయ్య తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ల బృందం

గుండె జబ్బులను తొలి దశలో గుర్తిస్తే తేలికగా అరికట్టవచ్చు

ప్రజాశక్తి - పెదకాకాని

తొలి దశలోనే గుండె సంబంధిత వ్యాధులను గుర్తిస్తే తేలికపాటి చికిత్సతో అరికట్ట వచ్చునని ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్ట్, గుండె వైద్య నిపుణులు డాక్టర్ శివ శ్రీనివాస్ రెడ్డి గుండం అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన పెదకాకానిలోని శివాలయంలో నారాయణ హాస్పిటల్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సింధు మందాళ మాట్లాడుతూ 40 సంవత్సరాలు పైబడిన వారు తప్పనిసరిగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి మనోహర్

వైభవంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్లు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పేరంటాళ్ళమ్మ తిరునాళ్లలో భక్తులు పోటెత్తారు. తెనాలి ఐతానగర్ లో వెలసిన పేరంటాలమ్మకు పొంగల్లు, నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ళ ఆదివారం ఆఖరిరోజు సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన పేరంటాల్లమ్మను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్నారు. భక్తులకు కమిటీ సభ్యులు మజ్జిగ, మంచినీరు సదుపాయం కల్పించారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగిన సిరిమానోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గున్నారు.

జూన్ 7న అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు తెనాలి నియోజకవర్గ ప్రజలు పెద్దఎత్తులో పాల్గొనాలని కమిటీ సభ్యులు గల్లా జ్ఞానశేఖర్ తెలిపారు. జూన్ 7న కొల్లిపర మండలం కిష్కింద పాలెంలో ప్రతిష్ఠించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. ట్రస్ట్ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ గోడపత్రిక, కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెనాలి మోహన్, కనపర్తి మోహన్ రావు, కుమ్మరి సాల్మన్ రాజు, కనపర్తి అబ్రహం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

బీవీఎన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బైపాస్ రోడ్డులోని ఎన్ఎస్ఆర్ విల్లాస్‌లో ఆదివారం నూతనంగా బీవీఎన్ ఇన్‌ఫ్రా అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించారు. వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కాపు సంఘం నాయకులు, వ్యాపారవేత్తలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై లిమిటెడ్ చైర్మన్ అండ్ సీఎండీ ఇంటూరి శివశంకర్‌కు, సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అతిథులను సంస్థ చైర్మన్ ఇంటూరి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర పద్మశాలియ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, నెంబర్ వన్ న్యూస్ ఛానల్ చైర్మన్ మంచాల సాయి సుధాకర్ నాయుడు, అర్బన్ సిఐ వినోద్ కుమార్, మచిలీపట్నం పోర్టు ఇంచార్జ్ నాగభూషణం, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు సత్కరిస్తున్న డెవలపర్ శివ

కోటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుంకర రఘుపతిరావు, వివిధ పార్టీల నాయకులు తిరుమల శెట్టి సురేంద్ర, కమ్మెల సుబ్బారావు, వాకాముత్యాలు, పూట్ల పాల శ్రీనివాస్, నల్లగొర్ల శ్రీరామకఅష్ణ, కాపు సంఘం నాయకులు ఇండ్ల సత్యం, అద్దంకి రవి కాంత్, బోనం రామారావు, కంకణాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వేగంగా అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాష్ట్రంలో అభివృది, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని టిడిపి సీనియర్ నాయకులు పోతినేని శ్రీనివాస్ అన్నారు. దుగ్గిరాల పాతలాకుల నుండి ఈమని గ్రామంలోని సమితి కార్యాలయంలో రోడ్డును పునర్నిర్మాణ పనులను ఆదివారం భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. నాలుగు కిలోమీటర్లు పొడవు ఉన్న రోడ్డు పునర్ నిర్మాణ పనులకు రెండు కోట్ల 84 లక్ష రూపాయలు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో రోడ్ల మరమత్తు పనులు వేగవంతంగా జరుగు తున్నా యన్నారు. ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోని మోడల్ నియోజక వర్గంగా అభివృద్ధి పరచ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి గూడూరు వెంకటరావు ఎంపీపీ షేక్ జబీన్, మండల పార్టీ

పనులు ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత, యార్డు చైర్మన్ ఉందాం ఝాన్సీ, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, షేక్ నిజాముద్దీన్, తోటకూర సీతారామయ్య, కాసరినేని కృష్ణ, కాబోతు దేవదాసు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సాయి చైతన్య, ఈమని గ్రామ సర్పంచ్ సిద్దల శ్రీమణి ఉజ్వల హరిణి తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో ఘనంగా మదర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బైపాస్ రోడ్డులోని ఎన్ఎస్ఆర్ విల్లాస్‌లో నూతనంగా ప్రారంభమైన బీవీయన్ ఇన్ ఫ్రా అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం మదర్స్ డే వేడుకలు జరిగాయి. కార్యాలయం ప్రారంభానికి హాజరైన సీఐ వినోద్ కుమార్ అనంతరం కార్యాలయంలో జరిగిన మదర్స్ డే వేడుకలలో కూడా పాల్గన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్ ను అర్బన్ సీఐ వినోద్ కుమార్ తల్లులచే కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బిడ్డను గర్భంలో నవమాసాలు మోసి కష్టాలు, బాధలకు ఓర్చుకోని పురిటి సమయంలో చావుకి ఎదురు పోరాడి బిడ్డలకు జన్మనిచ్చిన తల్లులకు శుభాభినందనలు అన్నారు. ప్రతి తల్లి తమ బిడ్డలను దేశం గర్వించే, సమాజానికి ఉపయోగపడే బిడ్డలను తయారు చేయడానికి కఅషి చేస్తుందన్నారు. తల్లులు పిల్లలను ఉన్నతమైన వ్యక్తిత్వంతో పెంచి దేశానికి

వేడుకల్లో పాల్గొన్న సీఐ వినోద్‌కుమార్

మంచి పౌరులను అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నెంబర్ వన్ న్యూస్ ఛానల్ చైర్మన్ మంచాల సాయి సుధాకర్ నాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుంకర రఘుపతిరావు, బీవీయన్ ఇన్ ఫ్రా అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ సీఎండీ ఇంటూరి శివశంకర్, వివిధ రంగాల ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ చెట్టు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఎటువంటి గాలి దుమారాలు లేవు.. భారీ వర్షాలు లేవు... తాడేపల్లిలో ఆదివారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం ఐదు గంటల సమయంలో మెయిన్ రోడ్డు కృష్ణుని గుడి వద్ద గల సచివాలయం రోడ్డు పక్కన ఎదురుగా ఉన్న ఓ భారీ వృక్షం నేల కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ట్రాఫిక్ లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు భావిస్తున్నారు. భారీ వృక్షం విరిగిపడిపోటానికి కారణం దానికి నీరు అందకపోవడమేనని స్థానికులు భావిస్తున్నారు. పెద్ద చెట్టు నేల కోలడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఏంటీఎంసీ అధికారులు పడిపోయిన చెట్టును తొలగించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మదర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఘనంగా అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని మండలంలోని నుదురుపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బాలలు తల్లిదండ్రులతో కలిసి మదర్స్‌డే కార్యక్రమాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత బాలల తల్లితండ్రులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్ కోటేశ్వరావు

గ్రంథాలయాన్ని సందర్శించిన చైర్మన్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం ఏపీ జిపి చైర్మన్ జి.కోటేశ్వరావు సందర్శించారు. వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగుచూసినళ్ళు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి శాఖా గ్రంథాలయాన్ని మోడల్ లైబ్రరీగా తీర్చిదిద్దుతానని అన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులతో ఆయన మాట్లాడి గ్రంథాలయం వారు కల్పిస్తున్న సదుపాయాలు, అవసరాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి శాఖ గ్రంథాలయ అధికారి ఎన్.ఆరోగ్యం, పి.కృష్ణ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నేడు జరిగే డయల్ యువర్ కమిషనర్, ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాల ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుండి 10:30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్ ద్వారా అర్జీలు స్వీకరిస్తామని, ప్రజలు 0863-2224202 నంబర్‌కు ఫోన్ ద్వారా స్థానిక సమస్యలపై ఫిర్యాదులు తెలియజేయవచ్చన్నారు.

అమృత్ 2.0 డిపిఆర్‌పై నేడు స్టేక్ హోల్డర్ల సమావేశం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమఅత్ 2.0లో భాగంగా సమగ్ర తాగునీటి పథకం అమలుకు రూపొందించిన డిపిఆర్‌పై సలహాలు, సూచనలు కోసం నగరంలోని స్టేక్‌హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్, ప్రజాప్రతినిధులతో నేడు సమావేశం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నగర మేయర్, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, సీనియర్ సిటిజన్స్, స్టేక్‌హోల్డర్స్ పాల్గొంటారని తెలిపారు.

సమ్మె శిబిరంలో పాల్గొన్న సిహెచ్‌ఓలు

సిహెచ్‌ఓల బకాయిల విడుదల పట్ల హర్షం

ప్రజాశక్తి - గుంటూరు

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల బకాయిల్లో ఆరు నెలల బకాయిలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు టి.ప్రవళిక పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్‌కి, అధికారులకు సిహెచ్‌ఓలు కృతజ్ఞతులు తెలిపారు. అదే విధంగా వేతన సవరణ, ప్రావిడెంట్ ఫండ్ తదితర అంశాలపై అసోసియేషన్ నాయకులతో త్వరితగతిన చర్చలు జరిపి పరిష్కారం కోసం స్పష్టమైన హామీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాగా సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె కొనసాగుతుంది. కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో సిహెచ్‌ఓలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దీక్షత, జిల్లా నాయకులు జ్యోత్స్న, పావని, అనిత రెడ్డి, అబ్దు స్, జహీర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కూరగాయలు కొనుగోలు చేస్తున్న కార్మికులు

రాజధానిలో 'సండే' సందడి

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో సండే సందడి నెలకొంది.ఆదివారం కావడంతో కార్మికులు నిత్యావసర సరుకులు,కూరగాయల దుకాణాల వద్ద పెద్ద సంఖ్యలో కనిపించారు.ఉదయం చికెన్ కొనుగోలు చేసిన కార్మికులు సాయంత్రం వేళ దుకాణాల వద్దకు వచ్చి వారం రోజులకు సరిపడేలా కూరగాయలు కొనుగోలు చేశారు.కార్మికులను దఅష్టిలో పెట్టుకొని కొంతమంది ప్రధాన రహదారికి ఇరువైపులా జీన్ ప్యాంట్లు,షర్ట్ లు అమ్మకాలకు ఉంచారు.రాజధాని నిర్మాణ పనులు మొదలుకావడంతో తుళ్లూరు, మందడం, వెలగపూడి, రాయపూడి తదితర గ్రామాలకు జార్కండ్, పశ్చిమ బంగా, బీహార్, అస్సాం తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు వచ్చారు. దీంతో చిల్లర కొట్లు, టీ స్టాళ్లు,హోటళ్ల వద్ద కార్మికుల సందడి నెలకొంది. తుళ్లూరులో ఆర్ వి ఆర్ కన్స్ట్రక్షన్ లిమిటెడ్ సంస్థ కార్మికుల కోసం 30 షెడ్లను నిర్మించింది.ఇక్కడకు ఇప్పటికే కొంతమంది కార్మికులు వచ్చారు. మరి కొంతమంది రావాల్సి ఉంది. ఫోరెన్సిక్ ప్రయోగశాల, ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ నిర్మాణ పనులు జరుగుతుండడంతో తుళ్లూరులో కార్మికుల సందడి పెరిగింది.

రోడ్డు పక్క వ్యాపారాలు..

సహకార సంఘాల ద్వారా రైతులకు

మెరుగైన సేవలే లక్ష్యం..

- రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘాల అభివృద్ధికి సహకరించాలి
- 'ప్రజాశక్తి'తో జిల్లా సహకార అధికారి ఎం. వెంకటరమణ

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పిఏసిఎస్) ద్వారా ప్రధానంగా రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ సకాలంలో ఋణాలు మంజూరు చేస్తున్నామని వ్యవసాయ ఋణాలతో పాటు, వ్యవసయేతర, ఇతర పరిశ్రమల స్థాపనకు దీర్ఘ, మధ్య, స్వల్ప కాలిక ఋణాలు అందజేస్తున్నామని జిల్లా సహకార అధికారి ఎం వెంకటరమణ అన్నారు. సహకార సంఘాలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేయడం జరిగిందని వివరించారు. 'ప్రజాశక్తి-కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన శాఖాపరమైన అంశాలను వెల్లడించారు.

పల్నాడు జిల్లాలో మొత్తం ఎన్ని పిఏసిఎస్‌లు ఉన్నాయి?ఎంత మంది రైతులు సభ్యులుగా ఉన్నారు?

పల్నాడు జిల్లాలో మొత్తం జిడిసిసి బ్యాంక్ పరిధిలో 59 పిఎసిఎస్ లు అదే విధంగా సత్తెనపల్లి మండలంలోని ధూళిపాళ్ల గ్రామంలో ఆంధ్రబ్యాంక్ ఫార్మర్స్ సొసైటీతో కలిపి మొత్తం 60 సహకార సంఘాలు రైతులకు సేవలను అందిస్తున్నాము. పల్నాడు జిల్లాలో 3,93,564 మంది రైతులు సంఘం సభ్యులుగా ఉన్నారు. దీనిని 5 లక్షలకు పెంచేందుకు కఅషి చేస్తున్నాము. రూ 10/- సభ్యత్వ రుసుము, రూ 300/- చెల్లించి సంఘంలో సభ్యునిగా చేరి సొసైటీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

పిఏసిఎస్‌ల ద్వారా ఎటువంటి రుణాలు మంజూరు చేస్తున్నారు?

వ్యవసాయ ఋణాలు, యంత్రాల కొనుగోలుకు, వ్యవసాయ అనుబంధ రంగాల వారికి రుణాలు మంజూరు చేస్తున్నాము. గత ఆర్థిక సంవత్సరంలో 59 పిఏసిఎస్‌ల ద్వారా రూ 525.32 కోట్ల స్వల్ప కాలిక ఋణాలు, రూ 24.79 కోట్ల దీర్ఘకాలిక ఋణాలు, రూ 165 కోట్ల మేర మధ్య కాలిక ఋణాలు,స్వయం సహాయక సంఘాలకు రూ 82.15 కోట్లు, జాయింట్ లైబిలిటీ ఋణాల కింద 21 మంది రైతులకు మొత్తంగా రూ 2.74 లక్షల ఋణాలు మంజూరు చేశాం. అదే విధంగా మాగాని సాగుకు రూ 40 వేలు, మిర్చి సాగుకు రూ 90 వేలు, ఆయా పంటలకు నిర్దేశించిన మేరకు రుణాలు మంజూరు చేస్తున్నాం. కారుమంచి,ఈపూరు, అంగలూరు, దూళిపాళ్ల, నరుకుళ్లపాడు పిఏసిఎస్‌ల పరిధిలో 5 పెట్రోల్ బంకులను సొసైటీల ద్వారా నిర్వహిస్తున్నాము.

రైతులకు ఎటువంటి సేవలు అందిస్తున్నారు?

జిల్లాలోని 37 సొసైటీలలో రైతులకు ఎరువులు విత్తనాలను అందజేస్తున్నాము. 23 సొసైటీల సిబ్బందికి ఇటీవల ప్రకాశం జిల్లా దర్శిలో కఅషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ ఇచ్చి వారికి అనుమతులు మంజూరు చేశాము. ఈ ఏడాది ఖరీఫ్ నాటికి ఆయా సహకార సంఘాలలో కూడా రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

రుణాలు వసూళ్లు ఏమేరకు అవుతున్నాయి?

స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ఋణాలు 90 శాతం మేర వసూలు చేయడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా ఆయా రుణాలకు సంబంధించి రూ.231 కోట్ల బకాయిలు ఉన్నాయి. జూన్ చివరి నాటికి 80 శాతం మేర మొండి బకాయిలు వసూలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించిన నేపథ్యంలో ప్రస్తుతం 50 శాతం మేర ఇటీవల వసూళ్లు చేశాం.

రుణాల మంజూరులో సిఇఓలు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి?

అక్కడక్కడా ఆరోపణలు వచ్చాయి. ఇటువంటి ఆరోపణలకు అడ్డుకట్ట వేసేందుకే పిఎసిఎస్ లో డిజిటల్ విధానం అమలు చేయడం జరిగింది. పూర్తి స్థాయిలో లావాదేవీలు కంప్యూటరీకరణ చేయడం ద్వారా సిబ్బంది అవినీతి చేసేందుకు ఆస్కారం లేకుండా ఉంటుంది. అవినీతికి పాల్పడితే తమ దఅష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం.

సహకార సంఘాలలో డిజిటల్ సేవల ప్రక్రియ పూర్తయిందా?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పూర్తిస్థాయిలో లావాదేవీలు మొత్తం డిజిటల్ విధానంలోనే కొనసాగుతుంది. 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాల లావాదేవీలను సైతం కంప్యూటర్ నందు నమోదు చేయడం జరిగింది. తద్వారా ఖాతాదారులకు రైతులకు మరింత పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం.

గోదాములు రైతులకు సక్రమంగా ఉపయోగపడలేదని విమర్శలకు సమాధానం?

పల్నాడు జిల్లాలో 500 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం కలిగిన 48 గోదాములు 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 2 గోదాములు వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఒక 40 గోదాములు ఆయా పిఏసిఎస్ లకు గ్రామాలకు దూరంగా ఉన్న నేపథ్యంలో వినియోగంలో లేవు. ధూళిపాళ్ల, శావల్యాపురం, నరుకుల్లపాడు గ్రామాలలో కోల్డ్ స్టోరేజీలు పూర్తయ్యాయి. ఈపూరు, పాకాలపాడు 2 కోల్డ్ స్టోరేజ్‌లు మంజూరు అయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తాయి.

బొల్లాపల్లి, జొన్నలగడ్డ సొసైటీలలో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి.. ఎటువంటి చర్యలు చేపట్టారు?

ఆయా అక్రమాలపై జిడిసిసి ఉన్నతాధికారులు నియమించిన తిసభ్య కమిటీ విచారణ జరుపుతుంది. అవినీతి, అక్రమాలు తేలితే సిఇఓల నుండి రికవరీ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

జిల్లా వ్యాప్తంగా సిబ్బందిని అక్రమంగా తొలగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి?

అక్రమంగా సిబ్బందిని తొలగిస్తున్నామని వస్తున్న ఆరోపణలలో వాస్తవం లేదు. 2019 తర్వాత విధుల్లో చేరిన వారు 2019 కంటే ముందు విధుల్లో చేరినట్లు రాజకీయ ప్రోదల్బంతో అక్రమంగా చేరిన వారిపై విచారణ జరిపి 3 కేసులలో సిబ్బందిని తొలగించడం జరిగింది. 2019 కి ముందు నుండి విధుల్లో ఉన్న సిబ్బందిని ఎవ్వరిని తొలగించలేదు.

రైతులకు, ఖాతాదారులకు ఏమైనా సూచనలు చేస్తారా?

పల్నాడు జిల్లాలో ఉన్న 59 పిఎసిఎస్ లలో 12 పిఎసిఎస్‌లు మాత్రమే లాభాల బాటలో నడుస్తున్నాయి. మిగతా పిఎసిఎస్‌లో కూడా ఋణాలు పొందిన రైతులు పారిశ్రామికవేత్తలు సకాలంలో ఋణాలు చెల్లించి ఆయా పిఎసిఎస్ ల అభివఅద్ధికి పాటుపడాలి. ఋణాలు సకాలంలో చెల్లించడం ద్వారా అపరాధ రుసుములు జరిమానాల నుండి బయట పడేందుకు అవకాశం ఉంటుంది. కారుమంచి, అంగలూరు, ఈపూరు, శావల్యాపురం, నరుకుల్లపాడు, మునుగోడు పిఎసిఎస్ లలో పీఎం సూర్యఘర్ పథకం కింద రాయితీపై సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశాము. ఆయా రాయితీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మార్పులకనుగుణంగా ఆక్వా శుద్ధజలం

ఆర్ ఆర్ బేవరేజెస్ కంపెనీని ప్రారంభించిన మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు

ప్లాంటు ప్రారంభోత్సవంలో పాల్గొన్న కె.ఎస్.లక్ష్మణరావు, డి.రమాదేవి, ఆకుల సత్య

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మానవ జీవన శైలిలో అనేక మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయని అందులో శుద్ధ జలం ప్రాముఖ్యత రోజుకు పెరుగుతూ ఉందని దానికి అనుగుణంగా మంగళగిరి మండలం ఎర్రబాలెంలో ఆక్వా వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడం అభినందనీ మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో పారిశ్రామిక వాడ నందు ఆర్ ఆర్ బేవరేజెస్ ఆధ్వర్యంలో నూతనంగా ఫుల్లీ ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాజధాని ప్రాంతం ఇటువంటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామం ఉన్నారు. ఆర్ఆర్ బేవరేజెస్ సంస్థ ఆక్వా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ సందర్భంగా సంస్థ పార్టర్స్ ఎల్.రాధిక, భీమిరెడ్డి రవీంద్రలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి, టిడిపి నాయకులు, మాజీ జెడ్పీటీసీ ఆకుల జయసత్య, ఉమా మహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, నాయకులు పాశం రామారావు, ఈమని అప్పారావు, డి.వెంకట రెడ్డి, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం ఏ . షిష్టి, సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి, ప్రముఖ పారిశ్రామికవేత్త పి.నరసింహారావు, ప్రముఖ ఆడిటర్ నరసింహ, టీడీపీ, జనసేన, సిపిఎం నాయకులు, పారిశ్రామికవేత్త ఎస్. రామరాజు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఆర్‌విఆర్‌జెసిలో నేషనల్ టెక్నాలజీ డే వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు

సాంకేతిక ప్రగతిపైనే, దేశ ఆర్థిక పురోగతి ఆధారపడి ఉందని, సమాజ శ్రేయస్సు దిశగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని ఆర్.వి.ఆర్ అండ్ జె.సి. ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జె.సి. ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు రూపొందించిన నూతన ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం సత్కరించారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు పరిశోధనలు జరపాలని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.వి.పి. చంద్రశేఖరరావు, డాక్టర్ కె.శోభ, డాక్టర్ సజ్జా రాధిక, డాక్టర్.కె.ప్రవీణ్ కుమార్ అధ్యాపకులు పాల్గొన్నారు.